KR TV

మన
# క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 113 | శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

## నేటి మాట

విద్య బాల్యానికి మాత్రమే పరిమితం కాదు. నాకున్న కొద్ది శక్తితో ఇంకా నేర్చుకోవాల్సిన విషయాలెన్నో ఉన్నాయి



-స్వామి వివేకానంద

## బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి!..

## స్వయంగా ఆహ్వానించిన కేటీఆర్

న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టీ.జీవన్ రెడ్డి నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గత కొంతకాలంగా కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డిని కేటీఆర్ స్వయంగా కలిసి, ఆయనను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ పర్యటనలో కేటీఆర్ వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కీలక నేతలు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సుమారు గంటకు పైగా సాగిన భేటీలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ మార్పుపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది.




## చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అవసరం

### ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు





న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కేవలం ప్రాతినిధ్యానికే పరిమితం కాకూడదని, నిర్ణయాధికారంలోనూ వారు కీలక పాత్ర పోషించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## కడపలో కట్టలు తెంచుకున్న ఫ్యాక్షనిజం..

### వ్యక్తిని కత్తులతో నరికి హత్య

- వల్లూరులో దారుణ హత్య
- మద్యం గొడవే కారణమా?
- పాతకక్షల అనుమానం
- ఘటనాస్థలికి పోలీసుల చేరిక
- కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభం




## సైబర్ నేరగాళ్ల గాలానికి చిక్కిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

- 'వికసిత్ భారత్' పేరిట మాయమాటలు
- ఉన్నతాధికారిగా నటించిన నిందితుడు
- రూ. లక్ష ఫోన్‌పే ద్వారా బదిలీ
- డబ్బులు పంపాక వెలుగులోకి మోసం




## ఒక్క తప్పు చేసినా యుద్ధం మొదలే

## ఇరాన్‌కు ట్రంప్ మాస్ వార్నింగ్




**న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. రెండు వారాల తాత్కాలిక యుద్ధ విరామం ప్రకటించిన కొద్ది గంటల్లోనే, ఇరాన్ నిబంధనలను అతిక్రమిస్తే భయంకరమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్ లో 'అమెరికాకు చెందిన అన్ని నౌకలు, యుద్ధ విమానాలు, సైనిక బలగాలు అదనపు ఆయుధ సంపత్తితో ఇరాన్ సరిహద్దుల్లోనే ఉంటాయి. హర్మూజ్ జలసంధిని తెరవకపోతే దాడులు తప్పవని అన్నారు ఇప్పటికే బలహీనపడిన శత్రువును పూర్తిగా తుడిచిపెట్టడానికి అవసరమైన ప్రతిదీ మా దగ్గర సిద్ధంగా ఉంది.

## నా జన్మ ధన్యమైంది.. అమరావతిని ఇక ఏ సైకో ఆపలేడు : సీఎం చంద్రబాబు




న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పట్టాదారు పాసుపుస్తకాలను కరెన్సీ నోట్లు తయారు చేసే టెక్నాలజీతో రూపొందించామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం బాపట్ల జిల్లా సూరేపల్లి గ్రామంలో నిర్వహించిన మీ భూమి – మీ హక్కు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పట్టాదారు పాసుపుస్తకాలను అందుకున్న రైతుల కళ్లలో ఆనందం చూసి.. తన జన్మ ధన్యమైందన్నారు. కూటమి ప్రభుత్వంలో అందించిన సుపరిపాలనతో 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఇకపై ప్రతి నెలా 9వ తేదీన ఒక ప్రాంతంలో రైతులకు పాసు పుస్తకాలు అందిస్తామని సీఎం మాటిచ్చారు. 2027 మార్చి నాటికి కోటి 12 లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది జులై నాటికి 32 లక్షల పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుల జీవనోపాధిపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు జాలర్లు ఆంధ్రా తీరంలోకి వస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ఆంధ్రా మత్స్యకారుల జీవితాలపై దెబ్బకొడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇక గత ప్రభుత్వం అన్ని వ్యవస్థల్నీ సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు.

ఆంధ్రప్రదేశ్ లోనే కాదు దేశంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ బీచ్ అని, ఎంతో క్లీన్ బీచ్ కూడా అన్నారు. మున్ముందు గోవా తరహాలో సూర్యలంక బీచ్ పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు.

## జీడిమెట్లలో వరుస అగ్ని ప్రమాదాలు

- రెండు చోట్ల దట్టమైన పొగతో
- భయాందోళనలో ప్రజలు
- ఘటనాస్థలికి అగ్నిమాపక సిబ్బంది
- మంటల అదుపుకు తీవ్రంగా శ్రమ
- కారణాలపై దర్యాప్తు కొనసాగింపు




## మూసీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

## రూ.4,100 కోట్ల రుణంపై ఏడీబీ పరిశీలన

- ☐ మంత్రుల కమిటీ ఏర్పాటు
- ☐ హైడ్రాతో కీలక సమావేశం
- ☐ చెరువుల పునరుద్ధరణపై ఫోకస్
- ☐ ఎస్టీపీలతో మురుగునీటి నియంత్రణ
- ☐ వరద ముప్పు తగ్గించే ప్రణాళిక
- ☐ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం
- ☐ భాగస్వామ్య శాఖలతో చర్చలు
- ☐ త్వరలో నిధుల విడుదల అవకాశాలు




**న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** మూసీ నది పునరుజ్జీవం, అభివృద్ధి హాట్ టాపిక్‌గా మారింది. ఎన్ని అడ్డంకులొచ్చినా ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం.. పేదలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని ప్రతిపక్ష పార్టీల ప్రకటనలు సైతం చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డిప్యూటీ సీఎం అధ్యక్షతన ముగ్గురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేసింది. మూసీ ప్రాజెక్టును ప్రజాస్వామ్య పద్ధతిలోనే చేపడతామని, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రాజెక్టుకు రుణం ఇవ్వనున్న ఏడీబీ బ్యాంకు ప్రతినిధులు పునరుజ్జీవన ప్రాజెక్టుకు సంబంధించిన పూర్వాపరాలతో పాటు సాధ్యాసాధ్యాలు, సవాళ్లపై భాగస్వామ్య శాఖలతో చర్చించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అందులో భాగంగానే మంగళవారం హైడ్రా అధికారులతో ఏడీబీ ప్రతినిధులు సమావేశమయ్యారు. మిగిలిన శాఖల అధికారులతోనూ సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి.

**రూ.4,100 కోట్ల రుణం:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు రూ. 4,100 కోట్ల రుణం తీసుకోవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. మొదట ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని భావించినా, కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఏడీబీ నుంచి రుణం తీసుకోవాలని రాష్ట్రానికి సూచించింది. మూసీ ప్రాజెక్టు వివరాలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు వారికి వివరించగా, పర్యావరణపరంగా ప్రాజెక్టు చేపడుతున్న నేపథ్యంలో నిధులిచ్చేందుకు అంగీకరించింది. నదికి ఇరువైపులా రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్లాన్లు రూపొందించిన ప్రభుత్వం.. వివిధ ప్రాంతాల నుంచి మూసీలోకి వచ్చి కలుస్తున్న వరద, మురుగునీటిని శుద్ధి చేయడానికి మూసీ పొడవునా ఆయా ప్రాంతాల్లో నిర్మించే ఎస్టీపీలకు పంపించనున్నారు. వీటన్నింటినీ ఏడీబీ ప్రతినిధులు పరిశీలించిన విషయం తెలిసిందే. మూసీ అభివృద్ధికి మొదటగా రూ. 7 వేల కోట్లతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ విషయాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

**హైడ్రాతో సమావేశం:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో హైడ్రా పాత్రపై ఏడీబీ ప్రతినిధులు ఆరా తీశారు. అందులో భాగంగానే హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. హైడ్రా మొదటి విడత చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణతో పాటు.. రెండో విడత చేపట్టిన 14 చెరువుల గురించి ఏడీబీ ప్రతినిధులు లోతుగా చర్చించారు.

మిగతాది 2 లో

## మంత్రి పొంగులేటి కాదు.. 'పొంగులూటీ'

### హరీష్‌రావు స్ట్రాంగ్ కౌంటర్




**న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పొంగులేటి రాష్ట్రానికి మంత్రిలా కాకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అధినేతలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

## నిప్పుల కొలిమిలా తెలంగాణ

### ఆ రెండు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్'!

- నిప్పుల కొలిమిలా తెలంగాణ
- ఆ రెండు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్'!
- మరో 3 డిగ్రీలు పెరగనున్న వేడి
- 43-44°c వరకు చేరే ఉష్ణోగ్రతలు
- మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్
- మధ్యాహ్నం బయటకు రావద్దని హెచ్చరిక




## మోసం చేశాడని మహిళ కన్నీటిపర్యంతం

### మరో జనసేన జడ్పీటీసీ పేరు తెరపైకి



**న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం మరువక ముందే జనసేన పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా మరో నేత తీరు హాట్‌టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే..

## మౌనిక హత్య కేసు.. దిమ్మతిరిగే నిజాలు వెలుగులోకి

న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గాజువాక మౌనిక హత్య కేసులో పోలీసుల విచారణలో దిగ్భ్రాంతి కలిగించే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు రవీంద్ర ఎంత క్రూరంగా ప్లాన్ చేసి మౌనికను అంతమొందించాడో స్టేట్‌మెంట్ రికార్డు చేసిన సందర్భంగా పోలీసులు షాకింగ్ వివరాలను వెల్లడించారు.

నిందితుడి పక్కా స్కెచ్..

మార్చి 29న తన స్నేహితుడి ఇంటి తాళాలు తీసుకున్న రవీంద్ర, అది తన సొంత ఫ్లాట్ అని నమ్మించి మౌనికను అక్కడికి తీసుకెళ్లినట్లుగా నిందితుడు రవీంద్ర వెల్లిడించాడు. అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో, మౌనిక కేకలు వేయకుండా రవీంద్ర ఆమె నోరు మూసివేసి, గొంతుపై మోకాలితో బలంగా నొక్కి ప్రాణాలు తీశానని ఒప్పుకున్నాడు. హత్య చేసిన అనంతరం రవీంద్ర అత్యంత కిరాతకంగా ప్రవర్తించాడు. తన సొంత ఫ్లాట్‌కు వెళ్లి ఒక ట్రాలీ బ్యాగ్‌ను తీసుకొచ్చాడు. మౌనిక మృతదేహాన్ని ఆ బ్యాగ్‌లో కుక్కి, ఎవరికీ అనుమానం రాకుండా తన ఫ్లాట్‌కు తరలించాడు. రవీంద్ర మృతదేహాన్ని దాచిపెట్టేందుకు తన ఫ్లాట్‌లోనే భయానక చర్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని ముక్కలుగా కోసి ఫ్రిజ్‌లో భద్రపరిచాడు. ఆ తర్వాత శరీర భాగాలను జీడితోటలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగలబెట్టాడు. అయితే, ఇక్కడ అసలు ట్విస్ట్ ఏమింటంటే.. ఈ హత్య జరిగిన ఫ్లాట్ రవీంద్ర స్నేహితుడిదే అయినప్పటికీ, అక్కడ హత్య జరిగిన విషయం అతనికి తెలియదని పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. నిందితుడు రవీంద్ర ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్నాడు.

## ఫీజు కట్టలేదని దారుణం: విద్యార్థినితో బాత్రూంలు కడిగించిన వైనం




న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మంచి, చెడులు చెప్పాల్సిన విద్యాసంస్థల్లో రోజురోజుకు మానవత్వం మంటగలిసిపోతోంది. ఫీజు చెల్లించలేదన్న నెపంతో ఒక విద్యార్థిని పట్ల కాలేజీ యాజమాన్యం అత్యంత అమానుషంగా ప్రవర్తించింది. తిరుపతి లోని శ్రీ వికాస్ నర్సింగ్ కళాశాల లో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని శ్రీ వికాస్ నర్సింగ్ కళాశాలలో నినిత అనే విద్యార్థిని నర్సింగ్ కోర్సు చదువుతోంది. మొదటి ఏడాదికి సంబంధించి రూ.2 లక్షల ఫీజును ఆమె సకాలంలోనే చెల్లించింది. అయితే, సెకండియర్‌కు సంబంధించిన ఫీజు చెల్లింపులో స్వల్ప జాప్యం జరిగింది. దీన్ని సాకుగా తీసుకున్న కాలేజీ యాజమాన్యం ఆమెపై వేధింపులకు దిగింది.

మూడు రోజుల పాటు నరకం..ఫీజు కట్టలేదని నినితను కాలేజీ యాజమాన్యం తీవ్రంగా వేధించింది. ఏకంగా 3 రోజుల పాటు ఆమెతో కాలేజీలోని బాత్రూంలను కడిగించడమే కాకుండా, గంటల తరబడి గోడ కుర్చీ వేయించి దండన విధించారు. ఒక విద్యార్థిని అని కూడా చూడకుండా ఆమెతో వెట్టి చాకిరీ చేయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం బయటకు రావడంతో విద్యార్థి సంఘాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కళాశాల వద్ద భారీ ఎత్తున ఆందోళనకు దిగాయి. బాధితురాలికి న్యాయం చేయాలని, విద్యార్థినిని వేధించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, కళాశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు జరిగిన ఘటనపై విచారణ జరుపుతున్నారు.

## మూసీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్
### రూ.4,100 కోట్ల రుణంపై ఏడీబీ పరిశీలన

మొదటి పేజీ తరువాయి

పునరుజ్జీవనంలో మీరేమైనా సూచనలు చేస్తారా అని హైడ్రా కమిషనర్‌ను ఏడీబీ ప్రతినిధులు కోరగా.. "నగరంలో చాలా చెరువులు మూసీకి అనుసంధానంగా ఉన్నాయి. ఈ చెరువుల పునరుద్ధరణతో మూసీ నదికి మంచినీరు చేరేలా హైడ్రా చర్యలు తీసుకుంటోంది. హైడ్రా అభివృద్ధి చేసిన ప్రతి చెరువు వద్ద ఎస్టీపీ ఏర్పాటు చేసి మురుగునీటిని ఎక్కడికక్కడ శుభ్రం చేస్తే.. ఆ భారమంతా మూసీ మీద పడకుండా జాగ్రత్త పడినట్లు అవుతుంది" అని వివరించారు. మూసీ ఎగువ భాగంలో వచ్చే వరదను కట్టడి చేయడానికి ఉస్మాన్ సాగర్ నిర్మాణం ఎలా ఉపయోగపడిందో, నగరంలోని గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణతో వరద ముప్పును అంతగా తగ్గించవచ్చని.. హైడ్రా ఆ దిశగా పని చేస్తోందని తెలిపారు. పార్కులు, ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలు, చెరువులు, నాలాల ఆక్రమణలు తొలగించడం పర్యావరణానికి దోహదపడే అంశాలని పేర్కొన్నారు. చెరువులు, నాలాల ఆక్రమణలతో కలిగే వరద ముప్పును హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా ఏడీబీ ప్రతినిధులకు చూపించారు. భూగర్భ జలాల వృద్ధికి చెరువుల పునరుద్ధరణ దోహదపడుతుందన్నారు.

ఇతర శాఖలతో..

మూసీ పునరుజ్జీవనంలో భాగస్వామ్య శాఖలతో ఏడీబీ ప్రతినిధులు సమావేశమవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే హైడ్రాతో సమావేశమైన ప్రతినిధులు త్వరలోనే జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ, నీటిపారుదల శాఖ అధికారులతోనూ సమావేశం కానున్నట్లు సమాచారం. ప్రాజెక్టులో చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించనున్నారు. ఈ సంప్రదింపుల తర్వాత నిధులు విడుదల చేసే అవకాశముంది.

## సెల్ఫీ తెచ్చిన ముప్పు: జలపాతంలో పడి ముగ్గురు యువతుల దుర్మరణం



న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): విహారయాత్రలో సరదాగా దిగాలనుకున్న సెల్ఫీ నలుగురు యువతుల జీవితాల్లో తీరని విషాదాన్ని నింపింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ లో ప్రమాదవశాత్తూ జలపాతంలో పడి ముగ్గురు యువతులు మృతి చెందారు. మృతులను జంబవలస ప్రాంతానికి చెందిన త్రిష, పవిత్ర, రత్నకుమారిగా గుర్తించారు. నీటి ప్రవాహంలో గాలిస్తుండగా వీరి మృతదేహాలు లభ్యమయ్యాయి. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడపడానికి వెళ్లిన వారు శవాలై తిరిగి రావడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ప్రమాద సమయంలో వీరితో ఉన్న అంజలి అనే మరో యువతి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆమెను కాపాడి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ అత్యవసర చికిత్స పొందుతోంది. లోతైన నీటి ప్రవాహం, జారుడుగా ఉన్న బండరాళ్లపై సెల్ఫీలు తీసుకునే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నా, ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మంత్రి పొంగులేటి కాదు.. 'పొంగులూటీ' హరీష్‌రావు స్ట్రాంగ్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

శాసనసభ సాక్షిగా పొంగులేటి తన సహచర మంత్రుల అవినీతిని అంగీకరించారని పేర్కొన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలను సభలో ఒప్పుకున్నారని, నాలుగు ప్రభుత్వ శాఖలు విచారణ జరిపి నివేదిక ఇచ్చినా, నోటీసులు జారీ చేసినా తనకు సంబంధం లేదనడం పొంగులేటి ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు. పొంగులేటి తన పొగరు తగ్గించుకోవాలని, ఆయన అక్రమాలను భవిష్యత్తులో మరిన్ని బయటపెడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన పేరును 'పొంగులూటీ' అని సంబోధిస్తూ హరీశ్ రావు సెటైర్లు వేశారు.

ప్రభుత్వ భూమే అయితే బౌన్సర్లు ఎందుకు..

ప్రభుత్వ భూముల కబ్జాపై హరీష్‌రావు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు కబ్జా అవుతుంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఏం చేస్తోందని నిలదీశారు. నాదర్‌గుల్‌లో ఉన్నవి ప్రభుత్వ భూములే అయితే పొంగులేటి అక్కడ బౌన్సర్లతో కాపలా పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. శిల్ప, ఏక్యూ వంటి సంస్థల్లో పొంగులేటి కుమారుడికి వాటా లేదా అని ఆయన నిలదీశారు. 2016లోనే నాదర్‌గుల్ భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టిందని హరీష్‌రావు గుర్తు చేశారు. అలాంటి భూములపై ఇప్పుడు జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి అక్రమ సంపాదనపై తాము వెనక్కి తగ్గబోమని, ప్రజాక్షేత్రంలో ఎండగడతామని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు.

## మోసం చేశాడని మహిళ కన్నీటిపర్యంతం మరో జనసేన జడ్పీటీసీ పేరు తెరపైకి

మొదటి పేజీ తరువాయి

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జెడ్పీటీసీ, జనసేన నాయకుడు జయప్రకాష్ నాయుడు తనను తీవ్రంగా మోసం చేశారంటూ ఓ మహిళా బాధితురాలు మీడియా ముందుకు వచ్చారు. ఆయన వల్ల తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను వివరిస్తూ సోషల్ మీడియాలో ఆమె విడుదల చేసిన వీడియో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. బాధిత మహిళ తన ఆవేదనను వ్యక్తం చేస్తూ, జయప్రకాష్ నాయుడు తనను ఆర్థికంగా, శారీరకంగా వాడుకున్నారని ఆరోపించారు. నమ్మించి అన్ని రకాలుగా తనను ఉపయోగించుకుని, తీరా ఇప్పుడు తనను నట్టేట ముంచారని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. కేవలం తన అవసరాల కోసమే తనను వినియోగించుకున్నారని ఆమె తీవ్రంగా ఆక్షేపించారు.

ప్రస్తుతం ప్రాణహాని.. వేధింపులు

జడ్పీటీసీ జయప్రకాష్ నాయుడు తనను ఆర్థికంగా చిన్నాభిన్నం చేయడమే కాకుండా, ప్రస్తుతం శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధితురాలు వాపోయింది. తనను వేధిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతున్నారు. వీడియోలో ఆమె కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. జనసేన పార్టీలో కీలకంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధిపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు రావడం పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో కాక పుట్టిస్తోంది. బాధితురాలు మీడియా మందుకు వచ్చిన తరుణంలో ఈ వ్యవహారాంపై పార్టీ అధినాయకత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం బాధిత మహిళ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

## కడపలో కట్టలు తెంచుకున్న ఫ్యాక్షనిజం.. వ్యక్తిని కత్తులతో నరికి హత్య

న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కడప జిల్లాలో ఫ్యాక్షనిజం కట్టలు తెంచుకుంది. వల్లూరు మండలం అచ్చింతరాయపల్లెలో గతరాత్రి ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేసిన ఉదంతం వెలుగుచూసింది. కొప్పల వెంకటసుబ్బయ్య అనే వ్యక్తిని కత్తులతో నరికి చంపినట్లు తెలుస్తోంది. కడప – తాడిపత్రి రోడ్డుపై ఈ హత్య జరిగింది. సుబ్బయ్య (45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతరాత్రి వల్లూరు బస్టాండ్ వద్ద ఆ ఊరికి చెందిన కొందరు యువకులతో మద్యం మత్తులో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడున్న స్థానికులు సర్దిచెప్పి పంపించారు. కాసేపటికే యువకులు సుబ్బయ్యపై కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో స్పాట్లోనే చనిపోయాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న డీఎస్పీ బాలస్వామిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కు తరలించారు. మద్యం గొడవే కారణమా? పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగిందా? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

## సైబర్ నేరగాళ్ల గాలానికి చిక్కిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కేంద్ర పథకం వికసిత్ భారత్ పేరుతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడి కొట్టించారు. వివరాల్లోకి వెళితే... జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రెటరీ అనంత రామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్ధిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈ రోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ. 2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు.

ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు

ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నెంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్ నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

## ఒక్క తప్పు చేసినా యుద్ధం మొదలే ఇరాన్‌కు ట్రంప్ మాస్ వార్నింగ్

మొదటి పేజీ తరువాయి



మేము అనుకున్న నిజమైన ఒప్పందం పూర్తిగా అమలు అయ్యే వరకు మా సైన్యం వెనక్కి రాదు' అని పోస్ట్ చేశారు.

ఒకవేళ ఏ కారణం చేతనైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, అప్పుడు మళ్లీ అసలైన 'షూటింగ్' మొదలవుతుందని ట్రంప్ అన్నారు. అది ఇరాన్ ఇప్పటివరకు చూడని విధంగా అత్యంత శక్తివంతంగా, భారీగా ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ దగ్గర అణు ఆయుధాలు ఉండకూడదని, అలాగే హోర్ముజ్ జలసంధిని ఖచ్చితంగా అందరి కోసం తెరిచి ఉంచాలని ట్రంప్ అన్నారు. ప్రస్తుతానికి మా గొప్ప సైన్యం ఆయుధాలను నింపుకుంటూ, విశ్రాంతి తీసుకుంటోందని తెలిపారు. నిజానికి, తమ సైన్యం నెక్ట్స్ విజయం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోందని డొనాల్డ్ ట్రంప్ సెటైర్లు వేశారు.

## జీడిమెట్లలో వరుస అగ్ని ప్రమాదాలు.. రెండు చోట్ల

న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నగరంలోని జీడిమెట్ల పారిశ్రామిక వాడలో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నిల్వ ఉంచిన వేస్ట్ కెమికల్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఇక మరోవైపు గంపల బస్తీలోని స్క్రాప్ గౌడన్‌లో కూడా మంటలు చేలరేగాయి, దట్టమైన నల్లటి పొగను చూసి స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ రెండు ప్రమాదాల గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు పక్కనే ఉన్న ఇతర పరిశ్రమలకు వ్యాపించకుండా ఉండేందుకు ఫైర్ ఇంజన్లతో తీవ్రంగా శ్రమిస్తున్నారు. కెమికల్, స్క్రాప్ గోడౌన్లు కావడంతో మంటలను అదుపు చేయడం సవాలుగా మారింది. ఈ ప్రమాదాలకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## నా జన్మ ధన్యమైంది.. అమరావతిని ఇక ఏ సైకో ఆపలేడు : సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

సూర్యలంక బీచ్ ను మరింత సుందరంగా మారుస్తామన్నారు. ఫలితంగా ఆదాయం పెరుగుతుందని, ఉద్యోగాలు ఎక్కువ వస్తాయని తెలిపారు.

ఆస్తుల కోసం తల్లీ చెల్లిని రోడ్డుకీడ్చిన వ్యక్తిని ఎవ్వరూ ఆదర్శంగా తీసుకోవద్దని సీఎం చంద్రబాబు సూచించారు. బాబాయ్ ను చంపి ఆ నేరం తనపై వేశాడని దుయ్యబట్టారు. అమరావతిపై కనీస సభ్యత లేకుండా జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. నాడు మూడు రాజధానులతో అయోమయం సృష్టించి.. నేడు మావిగన్ స్వరం అందుకున్నాడని, అమరావతిపై జగన్ కక్షగట్టాడన్నారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచాయని, ఇక అజేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఏపీకి అమరావతిని రాజధానిని చేస్తూ.. కేంద్రం రాజముద్ర వేసిందని, ఇక దానిని ఎవ్వరూ ఏం చేయలేరన్నారు. కొందరు అమరావతిని కట్టలేమని విమర్శిస్తున్నారని, వారందరికీ చేతల్లో సమాధానం చెప్తానన్నారు. ప్రజా రాజధాని, దేవతల రాజధాని అమరావతిని హైదరాబాద్ ను తలదన్నేలా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. 1000 మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదని సీఎం స్పష్టం చేశారు.

## నిప్పుల కొలిమిలా తెలంగాణ ఆ రెండు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్'!

న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు తన భగభగలను మొదలుపెడుతుండటంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం.. ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతల కంటే మరో 3 డిగ్రీల సెల్సియస్ మేర వేడి పెరిగే అవకాశం ఉంది. రాబోయే రెండు మూడు రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు ఐఎండీ అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ఇక్కడ ఉష్ణోగ్రతలు 43°C నుంచి 44°C వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత అధికంగానే ఉంటుందని, అందుకే ఆ జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళల్లో వేడి గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అవసరం : ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ప్రస్తుత తరుణంలో అత్యంత అవసరమని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మన ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని, ఇది దేశ రాజకీయాల్లో సరికొత్త చైతన్యాన్ని నింపుతుందని ప్రధాని అన్నారు.

'నారీ శక్తి వందన్ అధినియం' మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అది మహిళల హక్కులను గౌరవించే ఒక గొప్ప సంకల్పమని ఆయన అభివర్ణించారు. ఈ ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారానే 'వికసిత భారత్' లక్ష్యం సాకారమవుతుందని మోదీ స్పష్టం చేశారు. విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో మహిళలు రాణిస్తున్నట్లే, చట్టసభల్లో కూడా వారి గళం బలంగా వినిపించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి!.. స్వయంగా ఆహ్వానించిన కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఎందుకు ఈ మార్పు..?

కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న జీవన్ రెడ్డి, ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల పట్ల తీవ్ర అసహనంతో ఉన్నారు. ముఖ్యంగా జగిత్యాల రాజకీయాల్లో తన ప్రమేయం లేకుండా జరుగుతున్న నిర్ణయాలు, ప్రభుత్వంలో సీనియర్లకు సరైన గుర్తింపు లభించకపోవడం, స్థానికంగా ఇతర పార్టీల నేతల చేరికలు తన ప్రాధాన్యతను తగ్గిస్తున్నాయని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగులేని పట్టున్న జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతను పార్టీలోకి తీసుకురావడం ద్వారా, ఆ ప్రాంతంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ భావిస్తున్నారు. జీవన్ రెడ్డి పార్టీలోకి వస్తే ఆయనకు సముచిత గౌరవం మరియు బాధ్యతలు కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ భేటీ అనంతరం జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ ఆయన కాంగ్రెస్‌ను వీడి గులాబీ కండువా కప్పుకుంటే, అది అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగానే భావించవచ్చు.

## కుప్వారా బస్టాండ్‌లో భారీ అగ్నిప్రమాదం ఏకంగా కాలిబూడిదైన ఏడు బస్సులు

న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): జమ్మూ కాశ్మీర్ లోని కుప్వారా జిల్లా ప్రధాన బస్టాండ్‌లో బుధవారం అర్ధరాత్రి దాటాక భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పార్క్ చేసి ఉన్న ఏడు బస్సులు మంటలకు ఆహుతయ్యాయి. అయితే, అర్ధరాత్రి సమయంలో బస్టాండ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే 6 బస్సులు పూర్తిగా మంటల్లో చిక్కుకుని ఉండటాన్ని గమనించారు. సిబ్బంది సుమారు 7 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఈ ప్రమాదంలో మొత్తం ఏడు బస్సులు కాలిబూడదయ్యాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించలేదని అధికారులు ధృవీకరించారు. అర్ధరాత్రి కావడం, బస్సుల్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రస్తుతం అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయా, మరేదైనా ఉగ్ర కుట్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# ఎయిడ్స్ వ్యాధి పై ప్రజలకు విస్తృత అవగాహన




సూర్యాపేట, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రజలలో, విస్తృత అవగాహన కల్పించాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో, ఆరోగ్య వారం కార్యక్రమంలో 4వ రోజు ఎయిడ్స్ అవేర్నెస్ ప్రెవేన్షన్ కాంపెయిన్ డే , రెడ్ రన్ ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట వద్ద జెండా ఊపి ప్రారంభించి, స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సూర్యాపేట వరకు అనుసరించారు. ర్యాలీ సందర్భంగా ఎయిడ్స్పై అవగాహన,జీవన రక్షణ సురక్షిత జీవితం.ఆరోగ్య భవిష్యత్తు వంటి నినాదాలతో ప్రజలకు సందేశాలు అందించారు. బ్యానర్లు, పాంప్లెట్ల ద్వారా వ్యాధి నివారణ మార్గాలపై,అవగాహన కల్పించారు. తదుపరి కలెక్టర్ మాట్లాడుతూ, ఎచ్ఐవీ/ఎయిడ్స్ పై సరైన అవగాహన కల్పించి, వ్యాధి వ్యాప్తి విధానాలైన రక్త మార్పిడి, సూదులు/సిరంజీలు, తల్లి నుండి పిల్లకు సోకకుండా గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ఎచ్ఐవీ పరీక్షలు చేసుకోవాలని, సమాజానికి తెలియజేయడం, ఈ విషయాల గురించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు విస్తృతముగా అవగాహన కల్పించి.వ్యాధి వ్యాప్తి నివారించవలెనని కలెక్టర్ సూచించారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా,,పెండెం వెంకట రమణ మాట్లాడుతూ ఎచ్ఐవీ/ఎయిడ్స్ అంటూ వ్యాధికాకున్నా, అంటించుకునే వ్యాధి అని అసురక్షిత లైంగిక సంబంధాల వలన సంక్రమించే అవకాశం వున్నదని, నిరోద్ లను వాడుకోవాలని, వ్యాధి వ్యాప్తి నివారణ కొరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించ బడుతున్నవని, సూర్యాపేట, హుజూర్ నగర్ సబ్ జైల్ లో గల ఖైదీ లకు ఏ ఆర్టీ, ఎచ్ఐవీ/ఎచ్బి- బి , టీబీ పరీక్షలు నిర్వహించటం జరుగుతున్నదని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సూర్యాపేట యందు ట్రాన్స్ జెండర్ లకు ప్రత్యేక వైద్య నిపుణులు డా,,గురు రాజ్ నేతృత్వంలో 52 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగినదని, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల శిక్షణార్ధులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశామని అన్నారు. ఈ కారక్రమశీలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్గా ఎండి షఫీ ఉల్లా, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, మున్సిపల్ కమీషనర్ హనుమంతరెడ్డి డిప్యూటీ డిఎంహెచ్వో డా,,చంద్ర శేఖర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు నాజియా, శ్రీశైలం, శ్రావణి ఆర్ట్ మెడికల్ ఆఫీసర్, డా,, శాంత కుమార్,అమూల్య, ప్రణీత్, వాసవి, వార్డ్ కౌన్సిలర్లు రాజేశ్, ఈద ప్రవీణ్, మాణిక్యం అరుణ, ఎస్ఓ పి వీరయ్య, డిప్యూటీ డిఇఎమ్ఓ సంజీవ్ రెడ్డి మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం బంజారా భవన్ లో ఘనంగా ప్రపంచం బంజారా దినోత్సవం

**అధ్యక్షోపన్యాసం చేసిన ఎల్.జేఏసీ రాష్ట్ర సమన్వయ కర్త భూక్య శోభన్ నాయక్.**



ఖమ్మం, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ప్రపంచం బంజారా దినోత్సవం ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, ఈ దినోత్సవం బంజారా సమాజం యొక్క గొప్ప సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు మరియు సమాజానికి వారు చేసిన సేవలను గౌరవించడానికి మరియు బంజారా ప్రజల ప్రత్యేకమైన భాష, రంగు రంగుల సాంప్రదాయ దుస్తులు, జానపద కళలు సాంస్కృతిక వరసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఒక గొప్ప వేదిక అని అన్నారు. అంతే కాక బంజారా సమాజానికి తమ గుర్తింపు భాష, మరియు వరసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి ప్రేరణని ఇస్తుందని, ప్రపంచం వ్యాప్తంగా ఉన్న బంజారా ప్రజల మధ్య ఐక్యత ను బలోపేతం చేస్తుందని, మరియు 16కోట్ల గోర్ బంజారా ప్రజలు మాట్లాడే గోర్ భోళి లిపిని, ఎనిమిదవ షెడ్యూల్ లో చేర్చవలసిన సమయం ఆసన్నమైందని తెలియజేస్తూ, ప్రపంచ బంజారా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా అనేక మంది గోర్ బంజారా నాయకులు మాట్లాడుతూ, కేవలం 40-50లక్షల మంది మాత్రమే మాట్లాడే డోగ్రీ -బోడో వంటి భాషలు భారత రాజ్యాంగం లోని 8వ షెడ్యూల్ లో గుర్తింపు పొందడం విశేషం కానీ, 16కోట్ల గోర్ బంజారా ప్రజలు మాట్లాడే, గోర్ భోళి భాషను మాత్రం మినహాయించడం అన్యాయం అని తెలియజేసినారు. ఈ కార్యక్రమం లో తేజవత్ వెంకట్రాం, భూక్యా మంగ్యా నాయక్, బి.రాంబాబు నాయక్, ఎచ్.బి నాయక్, ధరవత్ రాములు నాయక్, భూక్యా లచ్చునాయక్, బి.కిషన్ నాయక్, డాక్టర్ ఎన్.మంగీలాల్ జాదవ్, బి.హనుమంతు, బి.కేశ్య నాయక్, అంగోత్ లక్ష్మణ్ నాయక్, జె.వీరన్న, డి.పర్మా నాయక్, ఆర్.కమలాకర్, మూడ్ బాల్సింగ్, డ.సాయి నాయక్, బి.రవి, బి.నరేష్, బి.హర్ష కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్



మహబూబాబాద్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఆర్అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, జాతీయ రహదారుల విభాగం, మున్సిపాలిటీ, పీఆర్ తదితర శాఖల అధికారులతో రహదారి భద్రత జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో పాటు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ గత కమిటి సమావేశంలో కమిటి దృష్టికి వచ్చిన అంశాలు ఇచ్చిన ఆదేశాలు ఎంతవరకు అమలు అయ్యాయో అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారి పై గుర్తించిన బ్లాక్ స్పాట్, ప్రమాదం జరిగే ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యల పై ఇచ్చిన సూచనలు ఎంతవరకు పూర్తి చేశారని జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అనవసరపు యు టర్న్ లను తగ్గించాలని సూచించారు. అదేవిధంగా జాతీయ రహదారులపై రాంగ్ రూట్లో వచ్చే వారిని కట్టడి చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వెళ్లే ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్ల పై ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు సంబంధిత పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చేపట్టాల్సిన చర్యల పై కమిటీకి ప్రతిపాదనలు సిఫారసు చేయాలని సూచించారు. ప్రస్తుతం పోలీస్ అధికారులు సిఫారసు చేస్తున్న ప్రతిపాదనలను వచ్చే కమిటీ సమావేశం నాటికి పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. అవసరమున్న చోట రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలలో హెచ్చరిక బోర్డు, జరుగకుండా ఉండడానికి వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ బ్రేకర్స్ లాంటివి పట్టాలని అన్నారు. పాఠ శాలల యొక్క వాహనాల యొక్క ఫిట్ నెస్ లను, డ్రైవర్ల లైసెన్స్ లను పరిశీలించాలని అన్నారు. జిల్లా స్థాయిలో అధికారులతో రోడ్ ఇన్స్పెక్షన్ బృందాన్ని తయారు చేయాలని అట్టి బృందం రహదారుల భద్రత విషయంలో తీసుకున్న నిర్ణయాలకు జరిగిన పనులను పరిశీలిస్తారని అన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో కూడా గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీ ని నియమించి అందులో ప్రజాప్రతినిదులని, యువకులను, మహిళలను, అన్ని శాఖల అధికారులతో గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పనిచేస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్.పి డాక్టర్ శబరీష్ రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన పలు చర్యల పై సూచనలు చేసారు. ట్రాఫిక్ రూల్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. జిల్లాలో రవాణా, పోలీసు శాఖ అధికారులు ట్రాఫిక్ రూల్స్ అమలుపై పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అధిక లోడు తో ప్రయాణించే ఆటో రిక్షాలు, బైక్ లపై ముగ్గురు ప్రయాణించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాలో, మున్సిపల్ పరిధిలలో ప్రముఖమైన వ్యక్తులతో రహదారి భద్రత పై ప్రచారాన్ని చేయించాలని, సమావేశాలు నిర్వహించాలని అన్నారు. మున్సిపల్ పరిధిలలో జరిగే వార్డు సభలలో స్థానికంగా పోలీసు అధికారుల సలహా సూచనలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు, రెవెన్యు అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.అనిల్ కుమార్, అడిషనల్ ఎస్.పి తిరుపతి రావు, జాతీయ రహదారుల విభాగం, మున్సిపాలిటీ, పీఆర్ ,మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర ప్రజా పోరాటాలకు ప్రతీక సిఆర్

## -వర్ధంతి సభలో బాగం




ఖమ్మం, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): భారతదేశంలో నిరంతర ప్రజా పోరాటాలకు ప్రతీకగా సిపిఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) నిలిచారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. జమీందారి కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి తుదిశ్వాస వరకు పేదల పక్షాన పోరాడిన యోధుడన్నారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో ఆయన చిత్ర పటానికి -పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల పాటు సిపిఐ జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సిఆర్ చారిత్రాత్మక పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. పోరాటాల ఫలితంగా దేశ వ్యాప్తంగా లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందన్నారు. ఇప్పుడు పాలకులు కేవలం కార్పొరేట్ల గురించి, సంపన్న వర్గాల గురించి మాత్రమే ఆలోచిస్తున్నాయని అందుకే ప్రపంచలో నాల్గవ రాజకీయ ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదిగిందని చెబుతున్న దారిద్ర్య రేఖకు దిగువన బతుకుతున్న వారి సంఖ్య అదే రీతిలో పెరుగుతుందన్నారు. ఒక పక్క మతోన్మాదం, మరో పక్క పెరిగిన ఆర్థిక అసమానతలు దేశ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టుగా మారాయని హేమంతరావు తెలిపారు. ప్రజల పక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజా -సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ ఉండాలని హేమంతరావు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ, ఎస్కె సైదా, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# భూమి పచ్చగా ఉంటేనే జీవం వికసిస్తుంది.. ఎంపీ వద్దిరాజు

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు “వృక్ష వేదం 2.0” గ్రంథం అందజేత

న్యూ ఢిల్లీ, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రాష్ట్రపతి భవన్లో గురువారం జరిగిన ఒక విశిష్ట కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు “వృక్ష వేదం 2.0” గ్రంథాన్ని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ సనాతన పర్యావరణ జ్ఞానం,ఆధునిక హరిత ఉద్యమం ఒకే వేదికపై కలిసినట్లైంది.

పంచభూత తత్త్వం – ఉపనిషత్తుల సందేశం

రాష్ట్రపతి ఈ కాలాన్ని ఒకేసారి “అమృతకాలం” (అవకాశాల యుగం), “ఆపద్కాలం” (సంక్షోభ యుగం)గా అభివర్ణిస్తూ, మానవుడు అధిక లోభంతో ప్రకృతి విలువలను మరచిపోతున్నాడని హెచ్చరించారు.

రాష్ట్రపతి త్రేతీయ ఉపనిషత్తులోని ప్రసిద్ధ శ్లోకాన్ని ఉదహరించారు:

తతోస్మాత్ వా ఆత్మనః ఆకాశః సృష్టః ।
ఆకాశాత్ వాయుః । వాయునాగ్నిః ।
అగ్నేః జలమ్ । జలాత్ పృథివీ

అర్థం

ఆత్మ నుంచి ఆకాశం, ఆకాశం నుంచి గాలి, గాలి నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు, నీటి నుంచి భూమి పుట్టాయి. ఈ పంచభూతాల నుంచే మనిషి పుట్టి, చివరికి మళ్లీ భూమిలో కలుస్తాడని గుర్తుచేస్తూ, ప్రకృతితో మన అనుబంధాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని ద్రౌపది ముర్ము వివరించారు

“వృక్ష వేదం 2.0” – హరిత విప్లవానికి ప్రతీక

“భూమి పచ్చగా ఉంటేనే జీవం వికసిస్తుంది” అనే సందేశాన్ని గ్రంథం ద్వారా ప్రస్తావిస్తూ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ దేశవ్యాప్తంగా ప్రభావవంతమైన మార్పు తీసుకురావాలని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

గత 8 సంవత్సరాల్లో సుమారు 19.6 కోట్ల మొక్కలు నాటిన ఘనత

పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా మార్చిన ఉద్యమం

దేశం నలుమూలలతో పాటు అంతర్జాతీయ స్థాయికి విస్తరించిన హరిత కార్యక్రమం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ముఖ్య కార్యక్రమాలు తెలంగాణలో రిజర్వ్ ఫారెస్ట్ పునరుద్ధరణ



పశ్చిమ బెంగాల్ సుందర్బన్స్లో 20,000 మాంగ్రోవ్ మొక్కల నాటకం.. లక్షకు పైగా మాంగ్రోవ్ నాటడం జరిగింది. కోటి వృక్షార్చన” కార్యక్రమం – ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసలు పొందిన విశిష్ట ప్రాజెక్ట్ఈ ఉద్యమం “హరా హై తో భరా హై” అనే నినాదంతో ప్రజలను ఆకర్షిస్తోంది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కే.ఆర్. సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినిపల్లి సంతోష్ కుమార్, ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు ఎం.కరుణాకర్ రెడ్డి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సహ వ్యవస్థాపకుడు సంజీవుల రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఒక స్పష్టమైన సందేశం వెలువడింది.

భారతీయ వేదాలు, ఉపనిషత్తుల్లోని పర్యావరణ జ్ఞానం నేటి ప్రపంచ సమస్యలకు సమాధానం చూపగలదు. ప్రకృతితో తన అనుబంధాన్ని గుర్తించాలి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలి భవిష్యత్ తరాలకు జీవించదగిన భూమిని అందించాలి “హరా హైతో భరాహై” పచ్చదనం ఉంటేనే జీవం సంపూర్ణంగా ఉంటుందని మానవాళికి సందేశమిచ్చారు.

# టెన్త్ పూర్తయిన విద్యార్థులకు బిగ్ అలర్ట్



న్యూస్ డెస్క్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని 35 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, కేజీబీవీలలో 2026-27 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీఆర్జేసీ సెట్ 2026 పరీక్ష మే 3 న జరగనుంది. ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశం కల్పించే ఈ పరీక్షకు ఇప్పటివరకు సుమారు 45 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ధరఖాస్తు గడువు ఈ నెల 15 వరకు ఉంది. ఆసక్తి గల విద్యార్థులు గడువు ముగిసేలోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారిక వెబ్సైట్: https://tgrjc.cgg.gov.in/, ఇతర పూర్తి వివరాల కోసం వెబ్సైట్లో అందుబాటులో ఉన్న ఇన్ఫర్మేషన్ బులెటిన్ను చూడవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు 7842991708, 18004252428 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

# వైఎస్ జగన్..మావిగన్ జోకర్

## వైఎస్ షర్మిల ఘాటు విమర్శలు




ఏపీ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మూడు రాజధానుల పేరిట వైఎస్ జగన్ రుషికొండను మింగేసి సొంతగాప్యాలెస్‌లు కట్టారని ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. అమరావతి రాజధానిపై జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. వైఎస్ జగన్ మావిగన్ జోకర్ అని ట్విటర్ వేదిక ద్వారా విమర్శించారు.

వారసులం అని చెప్పుకునే జగన్ వైఎస్ఆర్ పేరు వాడుకున్నారని, వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ ఎప్పటికీ వారసులు కాలేదని అన్నారు. వైఎస్ఆర్ భావజాలం ఉంటే జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వైఎస్ఆర్ వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడిగా ఎందుకు మారారని ఆరోపించారు. ఎస్సీలు, క్రైస్తవులపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు.

ఉమ్మడి ఏపీలో వైఎస్ పాదయాత్ర ప్రారంభించి ఇవ్వాళ్టికి 23 ఏళ్ళు. ఏప్రిల్ 9, 2003 లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం దాక ప్రజాహితమే పరమావధిగా సాగిన 1,457 కిలోమీటర్ల పాదయాత్ర కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోనే కాదు. దేశంలోనూ అధికారంలో తెచ్చిన ఒక శాశ్వత జ్ఞాపకమని అభివర్ణించారు.

# చంద్రబాబు, జగన్‌పై బీవీ రాఘవులు ఘాటు వ్యాఖ్యలు



ఏపీ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో హాట్ కామెంట్లు చేశారు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు.. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి శిల్పారామంలో జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న రాఘవులు.. మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర విభజనకు 12 సంవత్సరాలు పూర్తయినా ఇంకా ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని లేకపోవడం బాధాకరమని రాఘవులు పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఒకవైపు, మాజీ సీఎం వైఎస్ జగన్ మరోవైపు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాజధాని అభివృద్ధి కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారని, అందుకు అందరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఇక, వైఎస్ జగన్‌పై నేరుగా విమర్శలు చేస్తూ, ఆయనకు రాజకీయంగా మెచ్యూరిటీ లేదని రాఘవులు అన్నారు. మొన్నటి వరకు మూడు రాజధానులు అంటూ మాట్లాడిన ఆయన, ఇప్పుడు ఆ అంశాన్ని వదిలేసి ఇతర విషయాలపై వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రాజధాని ఏర్పడే సమయంలో అందరూ ఆనందించి, సహకరించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఏదో మాట్లాడాలనే ఉద్దేశంతో బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. మెచ్యూరిటీ లేకుండా మాట్లాడటం రాజకీయ నాయకులకు తగదని వైఎస్ జగన్‌ను ఉద్దేశించి చురకలు అంటించారు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు..

# ఇది తెలుగుదేశం 3.0 వర్షన్.. పైరవీలతో పనిలేదు



ఏపీ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు సమూల మార్పులు తీసుకువస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. ప్రతి టర్మ్‌లోనూ 33 శాతం (మూడో వంతు) కొత్తవారు ఉండాలన్నదే తమ అభిమతమని చెప్పారు. గ్రామస్థాయి నాయకుడు పొలిట్ బ్యూరో వరకు ఎదగడానికి అవకాశం ఉండాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ పంథా మారాలని ఆయన పేర్కొన్నారు. అలాగైతేనే పార్టీ పదికాలాల పాటు ప్రజాక్షేత్రంలో నిలబడగలదని అన్నారు. తెలుగుదేశం కేడర్ శిక్షణా తరగతుల్లో భాగంగా "కాఫీ కబుర్లు" పేరుతో పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్‌తో సరికొత్త దిశగా ముందుకు సాగుతోందన్నారు. పార్టీ కేడర్‌కు సభ్యత్వ నంబర్ ఆధార్ కార్డు లాంటిదని, ఆ నంబర్ ద్వారా ఎవరు ఎంత పని చేశారో స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు. పైరవీలకు తావులేకుండా కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించి పదవులు ఇస్తామని తెలిపారు. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాధారణ కార్యకర్తలు నారా చంద్రబాబు నాయుడు పక్కన కూర్చోవడం పార్టీలో వస్తున్న మార్పులకు సంకేతమని అన్నారు.

టీడీపీ రాజకీయ విశ్వవిద్యాలయం

పార్టీని అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం చేయడం, కష్టపడే కార్యకర్తలను ప్రోత్సహించడం శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశ్యమని లోకేష్ చెప్పారు. ఇకపై క్లస్టర్, యూనిట్, గ్రామ, మండల స్థాయిల్లో ఏడాది పొడవునా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ ఒక రాజకీయ విశ్వవిద్యాలయం లాంటిదని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రులతో పాటు చాలా మంది నాయకులు టిడిపి నుంచి వచ్చిన వారేనని గుర్తుచేశారు. 1989--94 మధ్య కాలంలో చంద్రబాబు ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు ట్రైనింగ్ క్లాసులు నిర్వహించి కేడర్‌ను చైతన్యవంతం చేశారని తెలిపారు. అయితే పార్టీ ఆవిర్భావం తర్వాత అట్టడుగు స్థాయి నుంచి భారీ స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహించడం ఇదే మొదటిసారిగా జరుగుతోందన్నారు.

నాయకులు కాదు... పార్టీనే శాశ్వతం!

తెలుగుదేశం కేడర్ ఆధారిత పార్టీ అని, "నేనే రాజు, నేనే మంత్రి" అనే భావనను నాయకులు మార్చుకోవాలని లోకేష్ సూచించారు. పార్టీలో ఎవ్వరూ శాశ్వతం కారని, పార్టీ మాత్రమే శాశ్వతమని స్పష్టం చేశారు. సమర్థవంతమైన నాయకుడు తన తర్వాతి నాయకత్వాన్ని తయారుచేస్తాడని చెప్పారు. గతంలో వ్యక్తులను నమ్మడం వల్ల పార్టీ నష్టపోయిందని, ఇప్పుడు వ్యవస్థపై ఆధారపడి ముందుకు సాగుతున్నామని అన్నారు. 2014--19 మధ్య కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా ఓటమి పాలయ్యామని గుర్తుచేశారు. దీర్ఘకాలంగా అధికారంలో ఉండాలంటే బీజేపీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను కట్టుబాటుతో అమలు చేసే క్రమశిక్షణ గల కేడర్ ఉండటమే వారి విజయ రహస్యమని అన్నారు. మై టిడిపి యాప్ మాదిరిగానే వారికి "సరళ్" యాప్ ఉందని, గ్రామస్థాయి కార్యకర్త నుంచి కేంద్ర మంత్రి వరకు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం వల్లే వారు విజయవంతమవుతున్నారని వివరించారు.

మహానాడును విజయవంతం చేద్దాం

1985 తర్వాత ఎన్నడూ గెలవని మంగళగిరిని ఎంచుకుని తొలి ప్రయత్నంలో ఓడిపోయానని లోకేష్ తెలిపారు. ఐదేళ్లు కష్టపడి పనిచేసి గత ఎన్నికల్లో 91 వేలకుపైగా మెజారిటీతో గెలిచానని చెప్పారు. భారీ మెజారిటీ వచ్చినప్పటికీ, నియోజకవర్గంలోని 20 బూత్‌లలో మైనస్ రావడంతో వాటిపై దృష్టి సారిస్తున్నానని తెలిపారు. కాన్ఫిడెన్స్ ఉంటే ఏదైనా సాధ్యమని చెప్పారు. పార్టీలో సమస్యలు ఉంటే అంతర్గత వేదికల్లో చర్చించి పరిష్కరించుకోవాలని, అలిగి పక్కకు తప్పుకోవడం పార్టీకి నష్టం చేస్తుందని హెచ్చరించారు. పార్టీలో సంస్కరణల కోసం తాను చంద్రబాబుతో కూడా గట్టిగా చర్చించానని పేర్కొన్నారు. మహానాడు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, దాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు నీడే మనకు శ్రీరామరక్ష

గత ఐదేళ్లలో అరాచక పాలనలో ఇబ్బందులు పడ్డామని లోకేష్ అన్నారు. దేవాలయాలపై దాడులు జరిగాయని, పార్టీ కార్యకర్తలపై దాడులు, తప్పుడు కేసులు నమోదయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని సమీక్షించి 60 శాతం అక్రమ కేసులను తొలగించామని చెప్పారు. మంచి రోజులు వచ్చాయని గతాన్ని మరవకూడదని, అధికారం ఉందని అహంకారం వద్దని సూచించారు. ఓర్పు, సహనంతో ముందుకు సాగాలని, నమ్మిన సిద్ధాంతాల కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు అనే మహావృక్షం నీడే మనకు రక్షణ అని పేర్కొన్నారు. నియమాలను పాటించని నాయకులకు మూడు సార్లు సూచనలు ఇస్తామని, వినకపోతే కొత్తవారికి అవకాశాలు ఇస్తామని స్పష్టం చేశారు.

జగన్‌ను సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదు

వైసీపీ అధినేత వైఎస్ జగన్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని లోకేష్ అన్నారు. ఒకరోజు ఒకటి, మరుసటి రోజు మరోటి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలకు దూరంగా ఉంటున్నారని, ఇంటి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. 2019లో ఓటమి తర్వాత చంద్రబాబు ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకున్నారని గుర్తుచేశారు. ఇసుక సమస్యలపై ఉద్యమాలు చేసి, కార్యకర్తలకు అండగా నిలిచారని తెలిపారు. కేడర్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. పదవులు మాత్రమే కాకుండా అవకాశాలు అందరికీ ఉంటాయని హామీ ఇచ్చారు.

హనీమూన్ ముగిసింది... జనంలోకి వెళ్లాలి!

ప్రస్తుతం పార్టీకి "హనీమూన్ పీరియడ్" ముగిసిందని, ఇకపై ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పనిచేయాలని లోకేష్ పిలుపునిచ్చారు. జూన్ నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లే కార్యక్రమాన్ని రూపొందిస్తామని చెప్పారు. ప్రతి బూత్ కీలకమని, 94 శాతం స్ట్రైక్ రేటుతో గెలిచినా 4,600 బూత్‌లలో వెనకబడ్డామని గుర్తుచేశారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడాలని, గత మహానాడులో ఇచ్చిన ఆరు శాసనాలను అమలు చేయాలని కోరారు. కార్యకర్తే అధినేత అనే భావన ఇప్పటికే అమల్లోకి వచ్చిందని తెలిపారు. కూటమి మళ్లీ అధికారంలోకి రావడం ద్వారా అభివృద్ధి కొనసాగుతుందని, చంద్రబాబు బలంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని లోకేష్ పేర్కొన్నారు.

# జనజీవన స్రవంతిలోకి ఐదుగురు మావోయిస్టులు..

## ఎస్పీ ఎదుట లొంగిబాటు



ఏపీ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పీఎల్జీఏ బెటాలియన్‌కు చెందిన ఐదుగురు సభ్యులు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సమక్షంలో లొంగిపోయారు. అడవి బాటను వీడి, సాధారణ పౌరులుగా జీవించాలనే నిర్ణయంతో వీరు పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు సైతం ఉండటం గమనార్హం. ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలకు ఆకర్షితులై, హింసను వీడి బయటకు వచ్చినట్లు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న ఫలాలను అందుకుని గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని చెప్పారు. లొంగిపోయిన వారికి తక్షణ సాయంతో పాటు అన్ని రకాల పునరావాస సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంకా ఎవరైనా అడవిలో ఉంటే జనజీవన స్రవంతిలో కలవాలని, హింసతో ఏదీ సాధించలేమని అమిత్ బర్దార్ తెలిపారు.

# మత్తులో యువతీ యువకుల వీరంగం..

## మితిమీరిన వేగంతో కారు బీభత్సం



ఏపీ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): చిలకలూరిపేటలో గంజాయి మత్తులో ఉన్న కొందరు యువతీ యువకులు కారుతో వీరంగం సృష్టించారు. మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న ఓ హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో హోటల్‌లోని ఫర్నిచర్, ఇతర సామాగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో హోటల్‌లో జనం తక్కువగా ఉండటంతో తృటిలో పెద్ద ప్రాణనష్టం తప్పింది. ఈ పరిణామంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీ చేయగా కారు నడుపుతున్న వ్యక్తితో పాటు అందులో ఉన్నవారు గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించారు. కారులో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నట్లు సమాచారం. నిందితులందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలతో చెలగాటమాడటంపై స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం: రూ.39,436 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్..!

ఏపీ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10:30 గంటలకు వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధిపై పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ప్రధానంగా ఎస్ఐపీబీ ప్రతిపాదించిన భారీ పెట్టుబడులకు కేబినెట్ అధికారికంగా ఆమోద ముద్ర వేయనుంది. రూ.39,436 కోట్ల విలువైన మొత్తం 31 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టనుంది.

రాజధాని విషయంలో...

ఈ సమావేశంలో ప్రధానంగా అమరావతి రాజధాని విషయంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి, సంబంధిత చట్టాల ఆమోదానికి ధన్యవాదాలు తెలుపనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీకి అందిస్తున్న వెన్నుదన్నుపై కేబినెట్ హర్షం వ్యక్తం చేయనుంది. దీంతో పాటు ఐటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ కంపెనీలు పెట్టనున్న పెట్టుబడులకు ఈ భేటీలో గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు.

కొత్త ఉద్యోగాల కల్పనపై..

రాష్ట్రంలో సుమారు 1.11 లక్షల మందికి పైగా కొత్త ఉద్యోగాల కల్పన, రాయలసీమను సోలార్ హబ్‌గా మార్చడం, విశాఖలో ఐటీ అభివృద్ధి వంటి అంశాలపై కూడా కేబినెట్ చర్చించనుంది. ఎన్నికల హామీల అమలు,



సంక్షేమ పథకాలపై కూడా ఈ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కేబుల్ టీవీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

## ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి వినతి



హైదరాబాద్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కేబుల్ టీవీ న్యూస్ ఛానల్ లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ సదుపాయం కల్పించాలని గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జర్నలిస్టుల పెద్దన్న విరహత్ అలీ ప్రత్యేక చొరవతో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి ని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో కలసి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విరహతలన్న కేబుల్ టీవీ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి సాధక బాధలను ప్రెస్ అకాడమీ చైర్మన్ కి వివరించారు. కేబుల్ టీవీ న్యూస్ ఛానల్ జేఏసీ కన్వీనర్లు బి నరసింహ చారి , డా పొదిల వెంకట్, విద్యాసాగర్, డాక్టర్ మహమ్మద్ యాసిఫ్ పాషా , మహేష్ కుమార్ ఉపాధ్యాయ, జిలకర రంజిత్, భానుప్రసాద్, జర్నలిస్టులు వార్తల సేకరణలో పడుతున్న ఇబ్బందులను ఛానల్ ప్రసారమవుతున్న నెట్వర్క్ ఆపరేటర్ల నుండి వస్తున్న ఆర్థిక ఇబ్బందులను ఆయనకు వివరించారు. రాష్ట్రస్థాయిలో 12 మందికి జిల్లా స్థాయిలో నలుగురికి చొప్పున పాత పద్ధతితోనే విలేకరులకు అక్రిడేషన్స్ ఇవ్వాలని వారు ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి కేబుల్ టీవీ ఛానల్ జర్నలిస్టుల సమస్యలను నూటికి నూరు శాతం పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని జెఏసి నాయకులు తెలిపారు.

# మెరిసిన మొయిజ్..!

## గోల్డ్ మెడల్ సాధించిన తాండూర్ యువకుడు మోయిజ్!

## నేషనల్ షూటింగ్ బాల్ టోర్నమెంట్ లో సత్తా




వికారాబాద్/తాండూర్ 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన లారీ డ్రైవర్ కుమారుడు మొయిజ్ నేషనల్ షూటింగ్ బాల్ టోర్నమెంట్ లో బంగారంలా మెరిశాడు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి తాండూరుకే గర్వకారణంగా నిలిచాడు. పట్టణంలోని ఇందిరానగర్ కు చెందిన ట్రక్ డ్రైవర్ మహమ్మద్ రఫీక్ కుమారుడు మొయిజ్ నేపాల్ లోని ఖాట్మండులో జరిగిన షూటింగ్ బాల్ టోర్నమెంట్ కు తాండూరు నుంచి ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ టోర్నమెంట్ లో మొయిజ్ సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో మొయిజ్ కు గోల్డ్ మెడల్ వరించింది. గోల్డ్ మెడల్ తో పాటు మొయిజ్ కు ట్రోఫీని అందజేశారు. మరోవైపు తాండూరు యువకుడు నేషనల్ లెవెల్ లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మొయిజ్ కు అభినందనలు తెలిపారు.

# గంజాయి సమాచారం ఇవ్వండి

## - రూ.5,000 వరకు బహుమతి పొందండి

## ఎస్పీ డా. శబరీష్, ఐ.పి.ఎస్



మహబూబాబాద్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): జిల్లా పోలీస్ శాఖ యువత ఆరోగ్యం, భద్రత మరియు భవిష్యత్తును కాపాడటానికి గంజాయి వినియోగం మరియు అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. డ్రగ్స్ దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక సమస్య. ఇది నిశ్శబ్దంగా యువత జీవితాలను నాశనం చేస్తూ కుటుంబాలను బలహీనపరుస్తుంది మరియు వ్యక్తులను నేరాల వైపు నడిపిస్తుంది. జిల్లా ప్రజలకు సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. గంజాయి లాంటి మహమ్మారి నుండి మన ఉరిని, యువత భవిష్యత్తుని కాపాడేందుకు గంజాయి వినియోగం లాంటి కార్యకలాపాలను గుర్తించి పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. బాధ్యత గల పౌరులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించగలరు. అందువల్ల మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలందరినీ గంజాయి వినియోగదారులు లేదా సరఫరా చేసే వ్యక్తుల గురించి విశ్వసనీయ సమాచారం అందించాలని కోరుతోంది. పోలీసులకు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడే సమాచారాన్ని అందించిన వారికి రూ.5,000 వరకు బహుమతి ఇవ్వబడుతుంది. సమాచారం ఇచ్చే వ్యక్తి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. ప్రజలు తమ సమాచారం ఈ ప్రత్యేక మొబైల్ నంబర్ ద్వారా అందించవచ్చు: 8712656999. మీ చిన్న సమాచారం ఒక పెద్ద మార్పును తీసుకురాగలదు. మన యువతను కలిసి మహబూబాబాద్ జిల్లాను పూర్తిగా డ్రగ్స్ రహిత జిల్లాగా కాపాడుకుందాం మార్చుకుందాం.

# కూకట్పల్లి డిగ్రీ కళాశాలలో నూతన భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్ మను చౌదరి

కూకట్ పల్లి, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కూకట్పల్లి గవర్నమెంట్ కళాశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి. జిల్లా కలెక్టర్ మను చౌదరి. కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ లు ముఖ్య అతిథులకు హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి .కలెక్టర్ మను చౌదరి లు మాట్లాడుతూ నూతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థిని విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి. ర్యాంకులు సాధించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గతంలో పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చదువుకోవాలంటే నాంపల్లి వెళ్లి చదువుకునే వారని నేను ఎమ్మెల్యే అయిన తర్వాత కూకట్పల్లి కి ప్రభుత్వ ఇంటర్. డిగ్రీ కళాశాల కావాలని పోరాడి కూకట్పల్లికి తీసుకొచ్చానని ఈరోజు కూకట్పల్లి డిగ్రీ కాలేజీ రాష్ట్రంలోనే అగ్రగామి గా నిలిచిందన్నారు. జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలలో ఒకే క్యాంపస్ లో ఉండడంతో స్థలం సరిపోక రెండు కళాశాలల విద్యార్థులు అధ్యాపకులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కాబట్టి బాలనగర్ కెపిహెచ్బి ప్రాంతాల్లో ఎక్కడైనా సరే నాలుగు ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు ప్రభుత్వ నిధులు లేకపోతే సిఎస్ఆర్ నిధులతో భవనాలను నిర్మించేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలియజేశారు. అలాగే స్టూడెంట్స్ కు లాప్ టాప్ లు. అంగన్వాడి టీచర్స్ కు సెల్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మరియు పలువురు ప్రజా ప్రతినిధులు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు






# రోడ్లపై ధాన్యం ఆరపోయటం, ప్రాణాలతో చెలగాటమే

## రైతులకు పోలీసుల విజ్ఞప్తి

## రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దు

## ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది-నరసింహ ఐపిఎస్, ఎస్పి



సూర్యాపేట, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రైతులు రోడ్లపై,ధాన్యము ఆరబోయడం వల్ల, వాహనదారులు గమనించక రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నదని, రైతులు ధాన్యం రోడ్లపై ఆరబోయడం ప్రమాదకరమని ఎవరు కూడా రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయవద్దని, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్, ఒక ప్రకటనలో అన్నారు. ధాన్యం ఆరబోయడం వల్ల వాహనదారులు, గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు అన్నారు. కావున రైతులు గమనించి సహకరించాలి అన్నారు. రైతులు రోడ్లపై ఆరబోసిన ధాన్యం కుప్పను వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురౌతు ప్రాణాలు కోల్పోతున్నారు, క్షతగాత్రులు అవుతున్నారు అని ఎస్పి గుర్తు చేశారు. ధాన్యం అరబోయడం వల్ల,ప్రమాదాలు జరిగి ఎవ్వరూ ప్రాణాలు కోల్పోవద్దు, అని కోరారు, కావున రైతులు గమనించి రోడ్లపై ధాన్యం. ఆరబోయవద్దు అని విజ్ఞప్తి చేశారు. పోలీసు సూచనలు పాటిస్తూ, సహకరించాలి అన్నారు. పోలీసు అధికారులు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.రాత్రి వేళ పశువులను వదిలి పెట్టవద్దు, అని ఎస్పీ కోరారు, వేసవి కాలంలో మేతకోసం పశువులను వదిలిపెట్టడం వల్ల, అవి రోడ్లపై వస్తున్నాయి వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు అన్నారు.

# అంగన్వాడి టీచర్లకు నూతన మొబైల్ ఫోన్ల పంపిణీ





నారాయణపేట, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నియోజకవర్గ పరిధిలోని ధన్వాడ, నారాయణపేట, దామరగిద్దా మండలాలకు చెందిన మొత్తం 225 మంది అంగన్వాడి టీచర్లకు నూతన మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నారాయణపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, నాయకులు హనుమంతు, శరణప్ప, మల్లేష్, స్థానిక వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే ఐసీడీఎస్ సీపీడీఓ పార్వతి మరియు శాఖ సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంగన్వాడి టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని మొబైల్ ఫోన్లను స్వీకరించారు. ఈ మొబైల్ ఫోన్ల పంపిణీ ద్వారా అంగన్వాడి సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడుతుందని అధికారులు తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



స్టేషన్ ఘనపూర్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): స్టేషన్ ఘనపూర్ లో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 14వ వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి-సారయ్య రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఎండాకాలంలో దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ తరచూ నిర్వహించడం అభినందనీయం అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వచ్చి ప్రజలకు తోడ్పడాలని ఆమె సూచించారు.లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ,ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు,స్థానిక నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# పత్తికొండ శ్రీను ను సన్మానించిన, నాళం సతీష్ మరియు ధనాల రమణ



ఖమ్మం, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ లో కార్యదర్శిగా ఎన్నికైన పత్తికొండ శ్రీను ని జిల్లా కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా 47వ డివిజన్ నాయకులు నాళం సతీష్ , 17వ డివిజన్ నాయకులు ధనాల రమణ శాలువాతో పత్తికొండ శ్రీను ని సత్కరించి, అభినందనలు తెలిపారు. అలాగే కమిటీలో ఎన్నికైన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పత్తికొండ శ్రీను మాట్లాడుతూ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీర్వాదం, తుమ్మల యుగంధర్ ప్రోత్సాహంతో తనకు ఈ పదవి దక్కిందని తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు తాను కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 29వ డివిజన్ కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు

# చొరవతో విద్యుత్ స్తంభ మార్పిడి



ఖమ్మం/ఏదులాపురం, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29వ డివిజన్ మారుతి నగర్, రోడ్ నెంబర్ 5 లో రోడ్డుపై విద్యుత్ స్తంభం అడ్డంగా ఉన్నందున, ప్రజలు ఇబ్బంది పడటం చూసి, విద్యుత్ స్తంభాన్ని రోడ్డు పక్కకు మార్పించడం జరిగింది. ఏ.ఈ తో మాట్లాడి స్తంభాన్ని రోడ్డు పక్కన వేయించడం పట్ల ప్రజలు 29వ వార్డ్ కౌన్సిలర్ ఉమా వెంకటేశ్వర్లు కి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు, కేసు రెడ్డి సురేష్ రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మేడిపల్లి పరిధిలో మరో సారి దొంగల హల్ చల్



మేడిపల్లి, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మల్కాజ్ గిరి కమిషనరేట్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మరోమారు దొంగలు హల్ చల్ చేశారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత కొద్ది రోజులుగా కాముగా ఉన్న దొంగలు పంజా విసిరారు. వరుస దొంగతనలతో పలు కాలనీవాసులు కునుకు లేకుండా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. మేడిపల్లి పీఎస్ పరిధిలోని ఎన్ఐఎన్ కాలనీ, పీర్జాదిగూడ మల్లికార్జున్ నగర్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్ఐఎన్ కాలనీకి చెందిన పెంద్యాల గీతా భవాని శంకర్ మార్చి 30న తమిళనాడులోని మదురైకు వెళ్లి, ఏప్రిల్ 8న తిరిగి ఇంటికి రాగా ప్రధాన ద్వారం తాళం పగులగొట్టబడినట్లు గుర్తించారు. ఇంట్లోని బీరువా తెరిచి ఉండగా సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి సామగ్రి దొంగిలించబడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక పీర్జాదిగూడ మల్లికార్జున్ నగర్లో ఎలగందుల శ్రీరాములు ఇంట్లో కూడా ఇదే తరహా చోరీ జరిగింది. శ్రీరాములు తన సోదరుడు మరణించడంతో ఈనెల 6న వారాసిగూడకు వెళ్లి, 8న తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 5 తులాల బంగారం, రూ.1.60 లక్షల నగదు దొంగిలించబడినట్లు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించి, కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.వరుసగా జరుగుతున్న చోరీలతో స్థానికులు భయంతో గడుపుతున్నారు. ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లడానికే భయపడుతున్నామని వాపోతున్నారు. కాలనీల్లో పోలీసులు పెట్రోలింగ్ పెంచి, దొంగతనాలను అరికట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# వేసవిలో చెరకు రసం, పుచ్చకాయ రసం.. రెండింటిలో దేన్ని తీసుకోవాలి..?

హెల్త్ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికే వేసవి తీవ్ర రూపం దాల్చింది. అనేక చోట్ల 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వేసవిలో దాహాన్ని తీర్చుకోవడం కోసం మాత్రమే కాకుండా శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను భర్తీ చేసేందుకు కూడా ఈ సీజన్‌లో జ్యూస్‌లను తాగాల్సి ఉంటుంది. జ్యూస్‌లను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే వేసవిలో చాలా మంది హైడ్రేషన్ కోసం తాగే జ్యూస్‌లలో పుచ్చకాయ జ్యూస్ ఒకటి. ఇవి ఈ సీజన్‌లో అధికంగా లభిస్తాయి కనుక చాలా మంది వీటిని నేరుగా తినడంతోపాటు జ్యూస్‌గా చేసుకుని కూడా తీసుకుంటారు. అలాగే వేసవిలో చెరకు రసాన్ని కూడా చాలా మంది సేవిస్తుంటారు. అయితే పుచ్చకాయల రసం, చెరకు రసంలలో ఏది ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది, ఎందులో పోషకాలు అధికంగా ఉంటాయి.. అన్న వివరాలను పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.



రెండింటినీ తాగాలి..

వేసవిలో దాహాన్ని తీర్చుకోవడం కోసం చాలా మంది జ్యూస్‌లను తాగుతుంటారు. వేసవి కాలంలో శరీరంలోని ద్రవాలను సమతుల్యం చేసి హైడ్రేషన్ కోసం జ్యూస్‌లను తాగాల్సి ఉంటుంది. రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవడం ద్వారా దాహాన్ని తీర్చుకోవడం మాత్రమే కాకుండా పోషకాలను కూడా పొందవచ్చు. వేసవి వేడిని తగ్గించడంలో మార్కెట్‌లో అనేక రకాల జ్యూస్‌లు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ చెరకు రసం, పుచ్చకాయ రసం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. వీటిల్లో పోషకాలు, ఎలక్ట్రోలైట్స్, నీటి శాతం ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణమని చెప్పవచ్చు. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనాన్ని అందిస్తాయి. అలాగే అనేక పోషకాలను పొందవచ్చు. అయితే ఈ రెండు జ్యూస్‌లలో దేన్ని తాగాలి అని ప్రశ్నిస్తే.. అందుకు పోషకాహార నిపుణులు రెండింటినీ తాగాలని సూచిస్తున్నారు. ఇవి అనేక లాభాలను అందిస్తాయి కనుక ఒకసారి ఒక జ్యూస్‌ను, మరొకసారి మరొక జ్యూస్‌ను తాగితే ఎక్కువ లాభాలు ఉంటాయని చెబుతున్నారు.

పోషకాలపై తయారీ విధానం ప్రభావం..

జ్యూస్‌లను తయారు చేసే విధానం వాటి పోషక విలువలపై ప్రభావం చూపిస్తుంది. కోల్డ్ ప్రెస్ పద్ధతిలో జ్యూస్ తీస్తే వాటిల్లో పోషకాలే అధికంగా ఉంటాయి. అయితే కొంత ఫైబర్ తగ్గుతుంది. చెరకు రసాన్ని ప్రత్యేక యంత్రాల ద్వారా తీస్తారన్న విషయం తెలిసిందే. ఇది కోల్డ్ ప్రెస్ విధానాన్ని పోలి ఉంటుంది. అందువల్ల చెరకు సహజసిద్ధమైన రుచి రసంలోనూ లభిస్తుంది. అలాగే అనేక పోషకాలను పొందవచ్చు. ఇక పుచ్చకాయ ముక్కలను గ్రైండ్ చేసి రసాన్ని తీస్తారు. అందువల్ల ఫైబర్ కొంత వరకు నిల్వ ఉంటుంది. ఈ రసంలో విటమిన్ ఎ, సి, లైకోపీన్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఐసీఎంఆర్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) తెలిపిన ప్రకారం చెరకు రసంలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అయితే అత్యంత శుభ్రమైన ప్రదేశంలో రసాన్ని తీస్తేనే ప్రయోజనం ఉంటుంది. ఇక పుచ్చకాయ రసంలో నీటి శాతం అధికంగా ఉంటుంది. అందువల్ల శరీరానికి ద్రవాలు చాలా త్వరగా లభిస్తాయి. డీహైడ్రేషన్ సమస్య త్వరగా తగ్గుతుంది.

చెరకు రసాన్ని బాగా చల్లగా చేసి తాగవచ్చు..

చల్లదనం విషయానికి వస్తే చెరకు రసం శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా చల్లదనాన్ని ఇస్తుంది. దీని వల్ల వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎండ వేడి నుంచి రక్షణ పొందవచ్చు. శరీరంలోని వేడి తగ్గుతుంది. శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలిన ప్రకారం చెరకు రసాన్ని చాలా కనిష్ట ఉష్ణోగ్రతల వరకు, అంటే 15 డిగ్రీల వరకు చల్లబరిచినా అందులో ఉండే పోషకాలు తగ్గవు. రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ జర్నల్ తెలిపిన ప్రకారం చల్లగా తీసుకునే చెరకు రసం వేసవిలో డీహైడ్రేషన్‌ను తగ్గించేందుకు ఎంతగానో పనిచేస్తుందని తెలిపారు. పుచ్చకాయలో 90 శాతం నీరు ఉంటుంది కనుక ఇది శరీరాన్ని సహజంగానే చల్లబరుస్తుంది. అందువల్ల ఈ విషయంలో రెండు జ్యూస్‌లలోనూ దేన్నయినా తీసుకోవచ్చు.

రెండూ మేలు చేస్తాయి..


ఈ రెండు జ్యూసుల చల్లదనం వ్యక్తి శరీర నిర్మాణం, పోషకాలను గ్రహించే సామర్థ్యం, జ్యూస్ తాజాదనంపై ఆధారపడి ఉంటుంది. అలాగే పంట పెంపకంలో ఉపయోగించిన నీటి నాణ్యత కూడా పోషక విలువలను ప్రభావితం చేస్తుంది. హైడ్రేషన్ పరంగా చెరకు, పుచ్చకాయ రసాలు రెండూ శరీరానికి అవసరమైన నీరు, ఎలక్ట్రోలైట్స్‌ను అందిస్తాయి. బయట పని చేసే వారు వేడి కారణంగా శరీరంలో కోల్పోయిన ద్రవాలను త్వరగా భర్తీ చేసుకోవడానికి ఈ జ్యూసులు ఉపయోగపడతాయి. న్యూట్రియెంట్స్ అనే జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన ప్రకారం ఈ రెండు రసాలు కూడా శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడతాయి. ఆరోగ్య ప్రయోజనాల విషయానికి వస్తే, చెరకు రసం శక్తిని పెంచే గుణం కలిగి ఉంటుంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల వచ్చే అలసటను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అలాగే చెరకు రసంలో ఉన్న ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది. పుచ్చకాయ రసం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వాపులను తగ్గించడం, చర్మానికి తగిన హైడ్రేషన్ అందించడం వంటి ప్రయోజనాలను కలిగి ఉంటుంది.

శరీర అవసరాలను బట్టి తాగాలి..

ఏ జ్యూస్‌ను ఎంచుకోవాలనే విషయంలో శరీర అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. బయట నుంచి వచ్చి తక్షణ శక్తి అవసరమైతే చెరకు రసం మంచిది. కానీ శరీరాన్ని చల్లబరచడం, హైడ్రేషన్ కోసం పుచ్చకాయ రసం ఉత్తమ ఎంపిక. అత్యుత్తమ ప్రయోజనాల కోసం ఈ రెండు రసాలను మితంగా తీసుకోవడం అవసరం. సరైన మోతాదు, సమయం కోసం పోషక నిపుణులు లేదా డైటిషియన్‌ను సంప్రదించడం మంచిది. ఇంకా ఇప్పటికే ఆరోగ్య సమస్యలు ఉన్నవారు లేదా మందులు తీసుకుంటున్నవారు ఈ రసాలను తీసుకునే ముందు వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే ఇవి మందుల ప్రభావాన్ని మార్చే అవకాశం ఉంటుంది. వేసవిలో సహజ పానీయాలను పరిశుభ్రంగా, తాజాగా తీసుకోవడం ద్వారా గరిష్ట ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. వేసవి వేడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే హైడ్రేషన్ కోసం సరైన పానీయాల వినియోగానికి ముందస్తు ప్రణాళిక అవసరమని వైద్యులు చెబుతున్నారు.

## ఉదయం బ్రష్ చేయకుండానే నీళ్లు తాగుతున్నారా.. అయితే మీరు ఈ విషయం తెలుసుకోవాల్సిందే..!


హెల్త్ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): సాధారణంగా చాలామందికి ఉదయం లేవగానే నీళ్లు తాగడం అలవాటు. ఉదయాన్నే నీళ్లు తాగే అలవాటు మంచిది కూడా. అయితే కొంతమంది బ్రష్ చేసి నీళు తాగితే.. కొంతమంది మాత్రం బ్రష్ చేయకుండానే తాగుతారు. అయితే ఇలా బ్రష్ చేయకుండా నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నోటిని శుభ్రం చేసుకోకుండా నీళ్లు తాగితే అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. ఆ అనారోగ్య సమస్యలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..



సాధారణంగా రాత్రికి పడుకుని ఉదయం లేచేసరికి నోటి నిండా బ్యాక్టీరియా ఫామ్ అవుతుంది. పళ్లపై, నాలుకపై అవి సూక్ష్మ క్రిములు పేరుకుపోతాయి. కాబట్టి లేవగానే నోరు శుభ్రం చేసుకోకుండా నీళ్లు తాగితే.. నీళ్లతోపాటు క్రిములు కూడా శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల అనేక వ్యాధులు వస్తాయి. పళ్లు కూడా దెబ్బతింటాయి. అయితే పల్లు తోముకుని పరగడుపున నీటిని తాగవచ్చని నిపుణులు చెబుతున్నారు.

పరగడుపున ఒక గ్లాస్ లేదా రెండు గ్లాసుల నీళ్లు తాగడంవల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుందని, దానివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు. ఉదయం లేవగానే బ్రష్ చేయకుండా నీళ్లు తాగడంవల్ల శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో ఉన్న టాక్సిన్స్, మలిన పదార్థాలు బయటకు పోతాయి. మల బద్ధకం, జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవు.

శరీరంలో కూడా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఖాళీ కడుపుతో నీళ్లు తాగితే చర్మ సమస్యలు పోయి ఆరోగ్యంగా ఉంటుంది. చర్మానికి సహజంగానే మెరుపు వస్తుంది. గోరు వెచ్చని నీళ్లు తాగితే జీర్ణాశయం శు భ్రమవుతుందని నిపుణులు అంటున్నారు.



మన క్రాంతి KR TV
శుక్రవారం 10 ఏప్రిల్ 2026

# క్రీడలు



epaper.krtvnews.com

## క్రికెటర్లకు షాక్..ఐపీఎల్ లో కొత్త రూల్



స్పోర్ట్స్ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఐపీఎల్ క్రికెటర్లకు బిగ్ అలర్ట్. ఐపీఎల్ జట్లలో బెంచ్ కు పరిమితం అయిన ఆటగాళ్లకు కొత్త రూల్స్ అమలు చేయబోతోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. ఇకపైన టీం షీట్ లోని 16 మందికే గ్రౌండ్ లోకి అనుమతి ఉంటుందని అధికారిక ప్రకటన చేసింది. మిగిలిన ప్లేయర్లు ఎవరూ కూడా గ్రౌండ్ లో అడుగు పెట్టకూడదని వెల్లడించింది. 16 మంది తప్ప మిగిలిన ప్లేయర్లు డ్రింక్స్, బ్యాట్లు, సందేశాలు తీసుకురాకూడదని ఆదేశాలు జారీ చేసింది బీసీసీఐ.

బెంచ్ కు పరిమితమైన ప్లేయర్లకు కీలక ఆదేశాలు

బౌండరీ చుట్టూ ఐదుగురు కంటే ఎక్కువ మంది బెంచ్ ప్లేయర్లు ఉండకూడదని స్పష్టం చేసింది. ఎల్ఈడి యాడ్ బోర్డులు, బౌండరీ లైన్ మధ్య తిరగడానికి వీలులేదని పేర్కొంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. ఈ రూల్స్ ఎవరైనా బ్రేక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. అటు ఇప్పటికే స్లీవ్ లెస్ జెర్సీలతో గ్రౌండ్ లోకి రాకూడదని ఇప్పటికే బీసీసీఐ పేర్కొన్న సంగతి తెలిసిందే. అలాగే కుటుంబ సభ్యులు, భార్యలను డ్రెస్సింగ్ రూమ్స్ లోకి తీసుకురాకూడదు. సొంత వాహనాల్లో హోటల్స్ నుంచి స్టేడియాలకు రాకూడదని వెల్లడించింది బీసీసీఐ.

## భారత్‌తో దోస్తీకి బంగ్లాదేశ్ క్రికెట్ ముమ్మర ప్రయత్నాలు



స్పోర్ట్స్ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. తారిఖ్ రెహమాన్ బంగ్లాదేశ్ కొత్త ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఒక్కొక్కటిగా పరిస్థితులను చక్కదిద్దుతున్నారు. ఇందులో భాగంగానే బంగ్లాదేశ్ క్రికెట్‌లోనూ సరికొత్త శకం ప్రారంభమైంది. మాజీ కెప్టెన్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ 11 మంది సభ్యులతో కూడిన అడ్-హాక్ కమిటీకి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం బోర్డులో సరికొత్త ఆశలు రేకెత్తిస్తోంది. బాధ్యతలు చేపట్టి వెంటనే తమీమ్ భారత్‌తో సంబంధాలపై దృష్టి సారిస్తున్నారు. గతం కొంత కాలంగా టీమిండియాతో దెబ్బతిన్న క్రికెట్ సంబంధాలను పునరుద్ధరించడమే లక్ష్యంగా తమీమ్ అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే భారత్‌లో పర్యటించేందుకు ఆసక్తి చూపడమే కాకుండా, ఈ ఏడాది చివర్లో ద్వైపాక్షిక సిరీస్ కోసం బీసీసీఐని బంగ్లాదేశ్‌కు ఆహ్వానిస్తూ అధికారికంగా ప్రతిపాదనలు పంపారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా భారత్ ఇప్పటికే బంగ్లాదేశ్‌లో పర్యటించాల్సి ఉన్న నేపథ్యంలో, ఈ నిర్ణయం రెండు దేశాల మధ్య నెలకొన్న విభేదాలను తొలగించే దౌత్యపరమైన ప్రయత్నంగా కనిపిస్తోంది.

వాస్తవానికి, టీ20 వరల్డ్ కప్ 2026ను భారత్, శ్రీలంక హోస్ట్ చేసింది. అయితే.. భద్రతా కారణాల దృష్ట్యా ఈ సీజన్‌కు బంగ్లాదేశ్ దూరమైంది. భారత్‌కు వచ్చేందుకు బంగ్లాదేశ్ టీమ్ నిరాకరించడంతో సంబంధాలు దెబ్బతిన్నాయి. మ్యాచుల వేదికలను మార్చాలన్న బంగ్లాదేశ్ విన్నపాన్ని ఐసీసీ తిరస్కరించింది. అంతేకాదు.. ఆ దేశం స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు అడ్మిన్ ఇస్లాం బుల్బుల్‌ను బోర్డు ఛైర్మన్ పదవి నుంచి తొలగించిన కొత్త యాజమాన్యం, రాబోయే 90 రోజుల్లోగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి బోర్డును గాడిలో పెట్టాలని భావిస్తోంది. మరోవైపు, తనను అక్రమంగా తొలగించారని ఆరోపిస్తూ మాజీ ఛైర్మన్ బుల్బుల్ ఐసీసీకి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ విషయంలో బుల్బుల్‌కు ఐసీసీ నుంచి పెద్దగా మద్దతు లభించేలా లేదు. దీనికి ప్రధాన కారణం ఆయన అనుసరించిన 'ద్వంద్వ నీతి' అని ఐసీసీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. టీ20 వరల్డ్ కప్ కోసం భారత పర్యటనకు వెళ్లొద్దని ప్రభుత్వం చెప్పిందని, అందుకే తాము రావడం లేదని గతంలో ఐసీసీకి బుల్బుల్ చెప్పారు. కానీ ఇప్పుడు తన పదవి తొలగింపు విషయంలో మాత్రం ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందని ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శలు వస్తున్నాయి.

## ఆ కుర్రాడిని జాతీయ జట్టుకు ఎంపిక చేయండి.. బీసీసీఐకి సూచించిన ఇర్ఫాన్ పఠాన్



స్పోర్ట్స్ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ బీసీసీఐకి సూచించాడు. ఇక అతని విషయంలో ఎదురుచూడాల్సిన అవసరం లేదన్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో అరంగేట్రం చేసిన వైభవ్ సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుత సీజన్‌లోనూ అదరగొడుతున్నాడు. సీఎస్కేపై 17 బంతుల్లో 52 రన్స్ చేసిన అతను మంగళవారం ముంబైపై 14 బంతుల్లో 39 రన్స్ చేశాడు. బుమ్రా వంటి వరల్డ్ క్లాస్ బౌలర్ బౌలింగ్‌లోనూ వైభవ్ ఇబ్బందిపడలేదు. పైగా తొలి బంతినే సిక్సర్‌గా మలిచి ఆశ్చర్యపరిచాడు.

ఈ నేపథ్యంలోనే వైభవ్‌ను జాతీయ జట్టుకు ఎంపిక చేసే విషయంలో ఆలస్యం చేయుద్దని బీసీసీఐకి పఠాన్ సూచించాడు. "బుమ్రా కోసం నేను ఎదురుచూస్తున్నా. గతేడాది అతని బౌలింగ్‌లో అవుటయ్యా. ఈ సారి మాత్రం అతన్ని బౌలింగ్‌లో కొడతా'అని వైభవ్ చెప్పాడు. చెప్పినట్టే బుమ్రా బౌలింగ్‌లో తొలి బంతిని సిక్స్ కొట్టి చూపించాడు. వైభవ్ ఆడిన తీరు బుమ్రాను ఆలోచించేలా చేసింది. 'అని పఠాన్ చెప్పాడు. అలాగే, వైభవ్ ఫియర్‌లెస్ మైండ్‌సెట్ గురించి మాట్లాడుతూ..'ఎవరు బౌలింగ్ చేస్తున్నారు? వారి యాక్షన్ ఏంటి? అని వైభవ్ పెద్దగా ఆలోచించడు. బంతిని మాత్రమే చూస్తాడు. బాల్ కొట్టే విధంగా ఉంటే కొట్టేస్తాడు. అదే అతనిలోని ప్రత్యేకత. ఈ కుర్రాడిని చాలా కాలం వెయిట్ చేయించొద్దు. జాతీయ జట్టులోకి తీసుకోండి. ఇప్పుడే తీసుకుంటే 20 ఏళ్లు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడతాడు.'అని పఠాన్ చెప్పుకొచ్చాడు.

## ఇండియన్ లేడీతో హోటల్ లో దొరికిపోయిన విదేశీ క్రికెటర్



స్పోర్ట్స్ న్యూస్, 09 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఐపీఎల్ 2026 టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగుతున్న తరుణంలో గుజరాత్ టైటాన్స్ ప్లేయర్ జాసన్ హోల్డర్ మాత్రం చిల్ మూడ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇండియన్ అమ్మాయిలతో తిరుగుతూ రిలాక్స్ అవుతున్నాడు. ఈ మేరకు ఓ వీడియో కూడా బయటకు వచ్చింది. గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య బుధవారం మ్యాచ్ జరిగింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ వేదికగా ఈ మ్యాచ్ నిర్వహించారు. దీంతో ఢిల్లీకి వచ్చిన గుజరాత్ ఆల్ రౌండర్ జాసన్ హోల్డర్, ఓ లేడితో కనిపించాడు. అయితే ఆ లేడీ ఇండియాకు సంబంధించిన వ్యక్తి కావడం ఇక్కడ హాట్ టాపిక్ అయింది.

హోటల్ లో కలుసుకున్న జాసన్ హోల్డర్ జంట

జాసన్ హోల్డర్, ఆ ఇండియన్ లేడీ ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్ లో కలుసుకున్నట్లు వీడియో బయటకు కూడా వచ్చింది. అయితే ఈ ఇద్దరిని కెమెరాలో ఓ వ్యక్తి క్యాప్చర్ చేస్తున్న నేపథ్యంలో, వీడియో తీయకు అంటూ జాసన్ హోల్డర్ హెచ్చరించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇక ఈ వీడియో వైరల్ కావడంతో ఆ ఇండియన్ లేడీతో జాసన్ హోల్డర్ డేటింగ్ లో ఉన్నాడని వార్తలు వైరల్ చేస్తున్నారు.

గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతోన్న జాసన్

ఢిల్లీలో ఓ లేడీతో దొరికిన జాసన్ హోల్డర్, గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్నాడు. ఢిల్లీతో జరిగిన మ్యాచ్ సందర్భంగా హోల్డర్ కు తుది జట్టులో అవకాశం రాలేదు. దీంతో రిజర్వ్ బెంచ్ కు పరిమితం అయ్యాడు. కాగా మొన్నటి వేలం సందర్భంగా ఏడు కోట్ల రూపాయలకు జాసన్ హోల్డర్ ను గుజరాత్ టైటాన్స్ దక్కించుకుంది. బౌలింగ్ తో పాటు బ్యాటింగ్ అద్భుతంగా చేస్తాడు హోల్డర్. ముఖ్యంగా ఫినిషర్ రోల్ చేసే సామర్థ్యం జాసన్ హోల్డర్ కు ఉంది.

KR TV మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...

శుక్రవారం 10 ఏప్రిల్ 2026

# సినిమా న్యూస్

epaper.krtvnews.com

## ‘రాకా’లో రమ్య కృష్ణ ఫిక్స్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్టుకు సంబంధించి తాజాగా టైటిల్ రివీల్ చేసి ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ ట్రీట్ ఇచ్చారు మేకర్స్. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ‘రాకా’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలుపుతూ అదిరిపోయే ఫస్ట్ లుక్ పోస్టర్ సైతం విడుదల చేశారు. ఇప్పటివరకు ఉన్న ఊహాగానాలకు తెరదించుతూ రిలీజ్ చేసిన పోస్టర్‌లో అల్లు అర్జున్ గతంలో ఎన్నడూ కనపడని అనూహ్యమైన రూపంలో దర్శనమిచ్చారు. గుండుతో, ఒంటిపై ప్రత్యేకమైన గుర్తులు, చెవిపోగులతో భిన్నంగా కనిపిస్తున్నారు. ఓ క్రూర మృగం లాంటి చేయి ఆయన ముఖాన్ని కప్పి ఉంచడం సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఇప్పుడు ఈ అప్డేట్‌తోనే మరో అప్డేట్ కూడా ప్రేక్షకులకు అందింది. ఈ చిత్రంలో సీనియర్ నటి రమ్యకృష్ణ ఓ కీలక పాత్రలో నటించబోతున్నట్లు గత కొద్ది రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే.



అయితే.. దీనిపై ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు. కానీ తాజాగా ఒక్క పోస్ట్‌తో క్లారిటీ ఇచ్చేసింది ఈ సీనియర్ నటి. ఈ మేరకు అల్లు అర్జున్ టైటిల్ పోస్టర్‌ను తన ఇన్‌స్టా వేదికగా షేర్ చేస్తూ.. ‘పరిధులకు అతీతమైన ఒక దృశ్యం కోసం సిద్ధంకండి’ అంటూ క్యాప్షన్ జత చేసింది. దీంతో ఈ పోస్ట్ కాస్త వైరల్ కావడంతో.. ఈ సినిమాలో మీరు కూడా భాగం అయినట్లే కదా ఈ పోస్ట్‌తో అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. కాగా.. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్మిస్తున్నారు. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ చిత్రంగా దీన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ‘రాకా’ అనే పదానికి రాక్షస శక్తి లేదా క్రూరత్వం అనే అర్థాలు ఉండటంతో, బన్నీ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారా? లేక ఇది ఏదైనా సోషియో-ఫాంటసీ కథాంశమా? అంటూ అభిమానులు, నెటిజన్లులలో క్యూరియాసిటీ నెలకొంది.

## ఒక్క టికెట్ ధర రూ. 90,000



కొత్త సినిమా రిలీజ్ అవుతుందంటే బెనిఫిట్ షోలకు టికెట్స్ రేట్స్ పెంచడం కామన్. సాధారణంగా ఇవి రూ. 1000 వరకు ఉంటాయి. కానీ ఓ సినిమాకు మాత్రం ఫ్యాన్స్ ఏకంగా రూ. 90,000 వేలు పెట్టి టికెట్ కొనడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హాలీవుడ్ విజువల్ వండర్ ‘డ్యూన్ 3’ మేనియా వరల్డ్ వైడ్‌గా అప్పుడే స్టార్ట్ అయింది. ఈ ఏడాది డిసెంబర్ 18న విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి ఐమ్యాక్స్ 70mm టికెట్లు బుకింగ్స్ ఓపెన్ అయిన నిమిషాల్లోనే అమ్ముడైపోవడం ఇప్పుడు షాకింగ్‌గా మారింది. ‘డ్యూన్ 3’ ఒక్కో టికెట్ ధర ప్రస్తుతం రీసేల్ మార్కెట్‌లో ఏకంగా రూ. 90,000 వరకు పలుకుతుంది. అయినా కూడా అమ్ముడు పోవడంతో ఈ సినిమా కోసం సినిమా లవర్స్ ఎంత ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

అంతే కాకుండా.. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లోని ప్రధాన నగరాల్లో ఈ సినిమా టికెట్ల కోసం భారీ పోటీ నెలకొంది. అయితే..?ఈ టికెట్ ధరలు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం ఐమ్యాక్స్ 70mm స్క్రీన్స్ కొరత. అమెరికా అండ్ యూకే మొత్తం కలిపి కేవలం 19 లొకేషన్లలో మాత్రమే ఈ స్పెషల్ ఫార్మాట్ అందుబాటులో ఉందని తెలుస్తుండగా... స్క్రీన్స్ కొరత, డిమాండ్ ఎక్కువ ఉండటంతో బ్లాక్ మార్కెట్‌లో టికెట్ల రేట్లు ఏకంగా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు తక్షణమే ఐమ్యాక్స్ 70mm స్క్రీన్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తుంటే.. ‘డ్యూన్ 3’ ఐమ్యాక్స్ ఎక్స్‌పీరియన్స్ కోసం ఆ మాత్రం ఖర్చు చేయక తప్పదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు డైహార్డ్ ఫ్యాన్స్.

## తమిళ ప్రాజెక్టుపై హింట్ ఇచ్చేసిన యంగ్ హీరోయిన్



యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తమిళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అయిందంటూ గత కొద్ది రోజులుగా వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు ఈ అమ్మడుకు సరైన హిట్ రాకపోవడంతో.. కోలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అడుగులు వేస్తుందని వార్తలు వచ్చాయి. తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం ‘సెయాన్’. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీని కమల్ హాసన్ తన బ్యానర్‌పై నిర్మిస్తుండటంతో ప్రేక్షకుల్లో హై ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. అయితే.. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించనున్నట్లు నెట్టింట ప్రచారం జరిగింది. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానప్పటికీ.. ఇది భాగ్యశ్రీకి మంచి ఆఫర్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు అభిమానులు. అయితే.. ఈ వార్తలపై ఇన్‌డైరెక్ట్ హింట్ ఇచ్చేసింది ఈ యంగ్ హీరోయిన్. ఈ మేరకు తాజాగా తన ఇన్‌స్టావేదికగా ఓ స్టోరీ పోస్ట్ చేసింది. అందులో.. శివకార్తికేయన్ ‘అమరన్’ సాంగ్ పెట్టుకుని ‘వనక్కం చెన్నై’ అనే క్యాప్షన్ జత చేసింది. దీంతో శివకార్తికేయన్ సినిమాలో భాగ్యశ్రీ భాగం అయినట్లు ఇన్‌డైరెక్ట్‌గా చెప్పేంసిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఫ్యాన్స్.

## ధురంధర్ కోసం ప్రభాస్



ప్రస్తుతం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ‘ధురంధర్: ది రివెంజ్’ ప్రభంజనం కొనసాగుతోంది. మార్చి 19న విడుదలైన ఈ చిత్రం బాలీవుడ్ చరిత్రలోనే కనివినీ ఎరుగని రీతిలో వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా 1700 కోట్ల మార్క్‌కు చేరువలో ఉంది. త్వరలోనే పుష్ప 2, బాహుబలి 2 రికార్డ్‌లు బద్దలు కొట్టే దిశగా దూసుకుపోతోంది. అయితే, తాజాగా ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ ఈ సినిమాను వీక్షించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ‘అల్లు సినిమాస్’లో ఈ చిత్రాన్ని ప్రేక్షకులతో కలిసి చూశారు.

సాధారణంగా సెలబ్రిటీలు ప్రైవేట్ స్క్రీనింగ్స్‌కు మొగ్గు చూపుతారు. కానీ ప్రభాస్ మాత్రం థియేటర్‌కు వచ్చి ప్రేక్షకులతో కలిసి సినిమా చూడటం విశేషం. ప్రభాస్‌తో పాటు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా ధురంధర్ 2ను వీక్షించారు. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిజానికి, ప్రభాస్ ఇలా ఆడియెన్స్‌తో కలిసి సినిమా చూసి చాలా కాలమే అవుతోంది. బాహుబలి తర్వాత పబ్లిక్ థియేటర్ ఎక్స్‌పీరియన్స్‌కు దాదాపుగా దూరమయ్యాడు డార్లింగ్. అసలు తన సినిమా ప్రమోషన్స్ కూడా సరిగ్గా చేయడం లేదు. ఇలాంటి సమయంలో సందీప్‌తో కలిసి థియేటర్లో సినిమా చూడడం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం సందీప్‌తో కలిసి ‘స్పిరిట్’ సినిమా చేస్తున్నాడు ప్రభాస్. ఈ నేపథ్యంలో ధురంధర్‌ను థియేటర్ ఎక్స్‌పీరియన్స్ చేశాడంటే.. స్పిరిట్‌తో సెన్సేషన్ క్రియేట్ చేయడానికి సిద్ధమవుతున్నాడని చెప్పడంలో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com